



# వ్యవస్థాపకుడు



కొంత కాలం క్రితం వీడియో పార్లర్స్ ఎలా వీధి వీధికి వచ్చాయో అలా ఇప్పుడు ఏ గొందిన చూసినా కాన్వెంటులు, స్కూల్సు, రెసిడెన్షియల్ కాలేజీలు, ఎంట్రన్స్ కాలేజీలు... వోహ్! విజ్ఞానం. వీధి వీధినా పారుతున్నది మున్సిపాలిటీ కాలవల్లా!

పిల్లలు... పిల్లలు... ఎవరి తాహతుకు తోచింది వారు చేరేస్తున్నారు. పుస్తకాలు కొంటున్నారు, ఫీజులు చెల్లిస్తున్నారు, వెళ్తున్నారు... వస్తున్నారు...

ఏ స్కూలువారు ఆ స్కూలు సెంట్ పర్సెంట్ రిజల్టులు చూపిస్తూనే వున్నారు. (ఒక్కడు పరీక్షకు కూర్చుని వాడు ప్యాసయితే హండ్రెడ్ పర్సెంట్ రిజల్టు, వాడు ముప్పాతిక సబ్జక్టులు ప్యాసయితే సెవెంటీ ఫైవ్ పర్సెంటు- సగం సబ్జక్టులు ప్యాసయితే ఫిఫ్టీ పర్సెంటు రిజల్టుగా ప్రకటింప చేసుకొని - విపరీతమైన వ్యాపారాలు చేస్తు న్నారని వినికిడి.)

అందరితోపాటు మా జోగినాథం కూడా ఓ కాన్వెంటును తెరిచాడు. అప్పుడే తెరిచాడు. కానీ గత దశాబ్దంగా తన సంస్థ సాధించిన విషయాలు పేపరు ప్రకటన చేశాడు. ఎప్పుడు స్థాపించబడినదో, ఏయే సంవత్సరం ఎంతెంతమంది చేరారో, ఎంత మంది ప్యాసయ్యారో... తెలుసుకోవడానికి టైములేని బిజీ తల్లిదండ్రులు జోగినాథం కాన్వెంట్‌లో చేర్చారు తమ సంతాన ఫలాల్ని.

ఆ సంతాన ఫలాలతో జోగినాథం కాన్వెంట్ క్లాసుకు నూటొక్క మందితో ఆర్టీసీలా బస్సులా నిత్య కళ్యాణం పచ్చతోరణంలా బర్రున పరిగెడ్తాంది పరీక్షలకై.

అనుకొన్న పరీక్షలు రానే వచ్చాయి. పరీక్షలు పెట్టాడు. క్లాసుకు నూటొక్క మంది చొప్పున అన్ని క్లాసులవారూ పరీక్షలు రాశారు.

రిజల్ట్సు చూసి జోగినాథం నీరు కారిపోయాడు. నూటొక్క మందికి ఒక్కడంటే ఒక్కడే ప్యాసయ్యాడు. మిగతా అందరూ ఫెయిలే!

ఎలా!

ఎంతో ఆశలు పెట్టుకొన్న అంత మంది తల్లిదండ్రుల హృదయాలు ఏమైపోతాయి!

అందుకే... ది గ్రేట్... జోగినాథం వేశాడు ఎత్తు! చేశాడు తల్లిదండ్రులను చిత్తు!!

నూటొక్క మందినీ ప్యాస్ చేశాడు. అదే క్లాసు బోర్డును ఒకటిని రెండుగా, రెండును మూడుగా మార్చి అదే క్లాసులో కొత్త పుస్తకాలతో తిరిగి నూతన సంవత్సరంలోకి అడుగు పెట్టాడు.

ఈ సంవత్సరం ఆ పర్సెంటును చూసి మరిన్ని క్లాసులు పెరిగాయి. జోగినాథం... ఇప్పుడు ఒక్క ప్రిన్సిపాలే కాదు...

అనేక విద్యాసంస్థల వ్యవస్థాపకుడు కూడా *

— ప్రపాదార్కె